వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థిగా
గూడూరి ఉమాబాల

ప్రజాశక్తి - భీమవరం, భీమవరం రూరల్

వైసిపి నరసాపురం ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాల బరిలోకి దిగనున్నారు. గత ఎన్నికల్లో ఇక్కడ వైసిపి నుంచి బరిలోకి దిగి ఎంపీగా గెలిచిన కనుమూరి రఘురామకృష్ణంరాజు రెబల్‌గా మారిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా గూడూరి ఉమాబాలను నియమిస్తూ వైసిపి అధిష్టానం ప్రకటన చేసింది. ఉమాబాల తండ్రి కీర్తిశేషులు పంపన చంద్రశేఖర్ భీమవరం మున్సిపల్ వైస్‌ఛైర్మన్‌గా పని చేశారు. ఉమాబాల కూడా కాంగ్రెస్ హయాంలో మున్సిపల్ కౌన్సిలర్‌గా పని చేశారు.

హామీలు మరిచారు.. ఓట్ల కోసం వస్తున్నారు..!

ఐదేళ్ల పాలనలో అమలు కాని వైసిపి హామీలు

డోలయమానంలో నిర్వాసితులకు పరిహారం, కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం, 'చింతలపూడి' రైతులు

రోడ్లు, వంతెనలపై తీవ్ర నిర్లక్ష్యం

నేడు దెందులూరులో ఎన్నికల 'సిద్ధం' సభ

హాజరు కానున్న సిఎం జగన్మోహన్‌రెడ్డి



'మాట తప్పం.. మడమ తిప్పం' అంటూ 2019 ఎన్నికల్లో వైసిపి అధినాయకుడు జగన్ జిల్లాకు పలు హామీలు గుప్పించారు. తమ సమస్యలు పరిష్కారమవుతాయని భావించిన ప్రజానీకం వైసిపికి గంపగుత్తగా ఓట్లు వేసి గెలిపించారు. అధికారంలోకొచ్చిన వైసిపి ఐదేళ్లు గడుస్తున్నా.. జిల్లా ప్రజానీకానికి ఇచ్చిన హామీల్లో ఏఒక్కటీ నెరవేర్చలేదు. ఇప్పుడు 2024 ఎన్నికలకు సన్నద్ధంలో భాగంగా వైసిపి అధ్యక్షుడు జగన్ దెందులూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో శనివారం పాల్గొనున్నారు. దీంతో గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల సం'గతేంటీ' జగనన్న అంటూ జనం ప్రశ్నిస్తున్నారు.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల వేళ ఓట్ల కోసం పలు హామీలు గుప్పించడం, గెలిచిన తర్వాత ప్రజలకిచ్చిన హామీలను తుంగలో తొక్కడం రాజకీయ పార్టీలకు పరిపాటిగా మారింది. 2019 ఎన్నికల్లో వైసిపి సైతం ఇదేవిధంగా జిల్లాప్రజానీకానికి ఇచ్చిన హామీల్లో ఐదేళ్లు గడుస్తున్నా ఏఒక్కటీ అమలు చేయలేదు. ఇప్పుడు మళ్లీ ఎన్నికల వేళ ప్రజల ముందుకొస్తున్న అధికార వైసిపిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసిపి అధికారంలోకి వస్తే పోలవరం నిర్వాసితులకు న్యాయం చేస్తామని గత ఎన్నికల్లో జగన్ హామీ ఇచ్చారు. పునరావాస ప్యాకేజీ రూ.6.25 లక్షల నుంచి రూ.పది లక్షలకు పెంచి అందిస్తామన్నారు. తన తండ్రి హయాంలో 2006కు ముందు సేకరించిన భూములకు ఎకరాకు రూ.ఐదు లక్షల చొప్పున పరిహారం ఇస్తామని చెప్పారు. 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం, కాలనీల నిర్మాణం, భూమికి భూమి వంటి అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని ఎన్నికల ముందు వాగ్దానం చేశారు. దీంతో పోలవరం నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి తెల్లం బాలరాజుకు నిర్వాసితులంతా పెద్దఎత్తున ఓట్లు వేసి గెలిపించారు. వైసిపి అధికారం చేపట్టి నాలుగున్నరేళ్లు దాటింది. ఇప్పటి వరకూ పునరావాస ప్యాకేజీ పెంచి అందించడంగాని, భూములకు ఇస్తామన్న పరిహారంతోపాటు నిర్వాసితులకు ఇచ్చిన ఏఒక్క హామీ అమలు చేయలేదు. 2023 ఆగస్టులో వచ్చిన వరదల సమయంలో కుక్కునూరు మండలం గొమ్ముగూడేనికి వచ్చిన సిఎం జగన్ వచ్చే జనవరి, ఫిబ్రవరి నెలల్లో నిర్వాసితులకు తాను ఇచ్చిన హామీ ప్రకారం పరిహారం అందిస్తామని చెప్పారు. జనవరి గడిచిపోయింది. ఫిబ్రవరి వచ్చేసింది. మరో రెండు, మూడు వారాల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. నిర్వాసితులకిచ్చిన హామీ నెరవేరుస్తారా అనేది సందేహాస్పదమే. ఇప్పుడు మళ్లీ ఎన్నికలకు 'సిద్ధం' అంటూ దెందులూరులో సన్నాహక సభ ఏర్పాటు చేస్తుండటంతో నిర్వాసితులకిచ్చిన హామీలపై తీవ్ర చర్చ సాగుతోంది.

కొల్లేరు హామీలు తూచ్..
కొత్తగా ఎకోసెన్సిటివ్ జోన్‌పై ముందుకు

రానున్న ఎన్నికలకు సంబంధించిన సన్నాహక సభను కొల్లేరు ప్రాంతమైన దెందులూరు నియోజకవర్గంలో శనివారం నిర్వహించనున్నారు. ఈ సభకు వైసిపి అధ్యక్షుని హోదాలో జగన్ హాజరు కానున్నారు. గత ఎన్నికల్లో కొల్లేరు ప్రాంతానికి ఇచ్చిన హామీ ఏఒక్కటీ వైసిపి ప్రభుత్వం నెరవేర్చలేదు. కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెప్పినా కాగితాలకే పరిమితం చేశారు. కొల్లేరులో రీసర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించి జిరాయతీ భూములను రైతులకు అందిస్తామని చెప్పి గాలికొదిలేశారు. కొల్లేరులోకి ఉప్పునీరు చేరకుండా ఆకివీడు మండలం దుంపగడప, మొగల్తూరు మండలం మొళ్లపర్రు, కృష్ణా జిల్లాలోని పడతడక వద్ద మూడు రెగ్యులేటర్లు నిర్మిస్తామని 2023 జూన్‌లో శంకుస్థాపన చేస్తామని సైతం చెప్పారు. ఇప్పటి వరకూ అతీగతీ లేదు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని కొల్లేరు ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్నారు. టిడిపి హాయాంలో కొల్లేరు మూడో కాంటూరుకు కుదింపుపై అసెంబ్లీలో తీర్మానం సైతం చేశారు. ఈ తీర్మానానికి అప్పటి ప్రతిపక్ష హోదాలో ఉన్న వైసిపి భేషరతుగా మద్దతు పలికింది. ఇప్పుడు అది మరిచి కొల్లేరును ఎకోసెన్సిటివ్ జోన్ పేరుతో పదో కాంటూరు వరకూ విస్తరించేందుకు సిద్ధమైంది. హెలికాప్టర్లతో సర్వే, మండల కేంద్రాల్లో అభిప్రాయ సేకరణ, కొల్లేరు పరిసర ప్రాంతాల ఎంఎల్‌ఎలతో కలెక్టరేట్‌లో సమావేశాలు సైతం జరిగిపోయాయి. కొల్లేరు ఎకోసెన్సిటివ్ జోన్ పరిధిలోకి వస్తే మరో 89 గ్రామాలు ఆ పరిధిలోకి వెళ్లడమే కాకుండా కొల్లేరు అభివృద్ధి పూర్తిగా నిలిచిపోనుంది. గత ఎన్నికల్లో కొల్లేరు ప్రాంత ప్రజలకు వైసిపి ఇచ్చిన హామీలు ఏమిటీ.. ఇప్పుడు చేస్తున్నదేమిటంటూ అక్కడి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొల్లేరు ప్రాంతానికి వస్తున్న జగన్ దీనిపై ఏం మాట్లాడతారో చూడాలి.

పత్తా లేని వాటర్‌గ్రిడ్.. 'చింతలపూడి' రైతులకు దగా

ఆక్వా చెరువులతో తాగునీరు కలుషితమైందని, తాము అధికారంలోకి వస్తే వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసి గోదావరి నుంచి పైప్‌లైన్ ద్వారా తాగునీరు ఏర్పాటు చేస్తామని గత ఎన్నికల్లో వైసిపి అధ్యక్షుడు జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక దానికి రూ.3,200 కోట్లు కేటాయించినట్లు హడావుడి చేశారు. తర్వాత డెల్టా ప్రాంతానికి మాత్రమే పరిమితం చేస్తున్నట్లు చెప్పారు. ఐదేళ్లు గడుస్తున్నా జిల్లాలో వాటర్‌గ్రిడ్ పూర్తి చేయలేదు. జనాలకు తాగునీరు అందించలేదు. చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులు తమకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని టిడిపి ప్రభుత్వ హాయాంలో అనేక ఆందోళనలు చేశారు. తాము అధికారంలోకి వస్తే చింతలపూడి రైతులకు న్యాయం చేస్తామంటూ వైసిపి నేతలు హామీ ఇచ్చారు. ఇప్పటికీ చింతలపూడి ఎత్తిపోతల బాధిత రైతులకు న్యాయం జరగని పరిస్థితి.

పామాయిల్ ఫ్యాక్టరీ ఆధునికీరణ, డెల్టా ఆధునికీకరణ తూచ్

జిల్లాలో పెద్దఎత్తున పామాయిల్ సాగవుతోంది. తాము అదికారంలోకి వస్తే పెదవేగి పామాయిల్ ఫ్యాక్టరీని ఆధునికీకరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ అది జరగలేదు. టిడిపి హాయంలో డెల్టా ఆధునికీకరణ గురించి వైసిపి నాయకులు తరచూ ప్రశ్నించేవారు. వైసిపి ప్రభుత్వం డెల్టా ఆధునికీకరణను పూర్తిగా పక్కన పెట్టేసింది. తూడు, గుర్రపుడెక్క తీయడంతోనే సరిపెట్టేసింది. దీంతో తుపాన్లు, వర్షాలకు ప్రతియేటా రైతులు పెద్దఎత్తున పంటను కోల్పోవడమే కాకుండా, సాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రోడ్లు, వంతెనల పరిస్థితీ అంతే

గత ఎన్నికల్లో ప్రధానంగా రోడ్ల దుస్థితిపైనే ప్రచారం సాగింది. రోడ్ల పరిస్థితిపై ప్రతిపక్షంలో ఉండగా ప్రస్తుతం వైసిపి ఎంఎల్‌ఎలుగా ఉన్న నాయకులు పాదయాత్రలు సైతం చేశారు. గడిచిన ఐదేళ్లలో జిల్లాలో రోడ్ల వ్యవస్థ బాగు చేయని పరిస్థితి నెలకొంది. ఉంగుటూరు మండలం నారాయణపురంలో ఏలూరు కాలువపై వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చినా నెరవేర్చలేదు. రోడ్లు, వంతెనల నిర్మాణాలను పట్టించుకోని పరిస్థితి. తుందుర్రు ఫుడ్‌పార్క్‌ను సముద్రపు ఒడ్డుకు తరలిస్తామని, నరసాపురం ప్రాంతంలో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామని ఇలా అనేక హామీలు ఇచ్చినప్పటికీ వైసిపి ఏఒక్కటీ నెరవేర్చని పరిస్థితి ఉంది. దీంతో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మళ్లీ ఓట్లు ఎలా అడుగుతారని జనంలో తీవ్ర చర్చ సాగుతోంది.

నేడు సిఎం పర్యటన సాగేదిలా

ఎన్నికల సన్నాహాక సభకు హాజరు

మూడు జిల్లాల నుంచి తరలిరానున్న వైసిపి నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల సన్నాహాక కార్యక్రమంలో భాగంగా శనివారం ఏలూరు శివార్లలో జాతీయ రహదారికి ఆనుకుని సహరా గ్రౌండ్స్‌లో జరగనున్న బహిరంగ సభకు సిఎం జగన్ హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనున్నారు. ఈ సభకు సిఎం జగన్ మధ్యాహ్నం 2.40 గంటలకు తాడేపల్లి నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి 3.25 గంటలకు దెందులూరు సమీపంలో హైవే పక్కన ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 3.30 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకుంటారు. 3.30 నుంచి 4.45 గంటల వరకూ బహిరంగసభలో ప్రసంగిస్తారు. 4.55 గంటలకు తిరిగి హెలీకాప్టర్‌లో బయలుదేరి 5.40 గంటలకు సిఎం తన నివాసానికి చేరుకుంటారు. సిఎం ఎన్నికల సభ నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం రాకుండా వాహనాల మళ్లింపు చేపట్టారు. ఇప్పటికే సభ ఏర్పాట్లను పూర్తి చేశారు. వైసిపి నాయకులు సభ ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

క్రీడాస్ఫూర్తితో రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించాలి

కలెక్టర్ ప్రశాంతి - జిల్లాలో ముగిసిన 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా స్థాయిలో సాధించిన విధంగా క్రీడా స్ఫూర్తితో రాష్ట్ర స్థాయిలో కూడా పతకాలు సాధించాలని క్రీడాకారులకు కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. స్థానిక డిఎన్ఆర్ కళాశాల క్రీడా మైదానంలో జిల్లాస్థాయి 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు ముగిశాయి. జిల్లాస్థాయిలో గెలుపొందిన జట్లకు ట్రోఫీలు, మెడల్స్, ప్రశంసా పత్రాలను జాయింటు కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ ప్రశాంతి అందజేశారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన జట్లు విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలు కూడా చాలా అవసరమని, ప్రతి విద్యార్థి క్రీడల్లో ముందుకు సాగాలని అన్నారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కోకో, కబడ్డీ పోటీల్లో పురుషులకు, మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా 30 టీమ్‌లకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, ట్రెయినీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, డిఎల్‌డిఒ ఎవి.అప్పారావు, తహశీల్దార్ వై.రవికుమార్, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, డిఎన్ఆర్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), డిఎస్‌డిఒ ఎం.రాజేష్, పీడీ, పిఇటి అసోసియేషన్ సెక్రటరీ ఎమ్‌డి.కుదుష్, ఎస్‌జిఎఫ్ సెక్రటరీ పిఎస్ఎన్.మల్లేశ్వరరావు, చీఫ్ కోచ్ డాక్టర్ ఎం.దుర్గారావు, ఫిజికల్ డైరెక్టర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకే పెద్ద పీట

శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు



మాట్లాడుతున్న శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు

ప్రజాశక్తి - పోడూరు

మహిళలు బాగుంటే ఆ ఇల్లు సస్యశ్యామలంగా ఉంటుందని, ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. తూర్పుపాలెం క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం మాజీ మంత్రి జిల్లా అధ్యక్షులు చెరుకువాడ శ్రీరంగనాధరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మనసారా ఆసరా నాలుగో రోజు సంబరాల్లో భాగంగా ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మహిళలనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి నాలుగు మండలాల నుంచి 11 వేల మంది డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరాలను ముందుకు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. నామినేటెడ్ పదవుల్లో నూటికి యాభై శాతం మహిళలకే ఇచ్చారని తెలిపారు. నియోజకవర్గంలో ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాధరాజు మహిళలకు చాలా గౌరవం ఇస్తున్నారన్నారు. ఇంత గొప్ప కార్యక్రమం చేపట్టడం మామూలు విషయం కాదన్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు జరగాలంటే మళ్లీ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ఎంఎల్‌ఎ శ్రీ రంగనాధరాజును మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

జగన్ పాలనలో వ్యవసాయ శాఖ అడ్రస్ గల్లంతు

రైతు పోరుబాట పాదయాత్రలో ఎంఎల్‌ఎ నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

జగన్ పాలనలో వ్యవసాయ శాఖ, ఆ శాఖ మంత్రి అడ్రస్ గల్లంతయిందని పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు విమర్శించారు. రైతు పోరుబాట పాదయాత్రను ఆయన శుక్రవారం శివదేవుని శిక్కాల గ్రామంలో ప్రారంభించారు. యాత్ర రాత్రికి పోడూరు మండలం మట్టపర్రు చేరుకుంది. ఈ పాదయాత్ర పాలకొల్లు నియోజకవర్గంలో మూడు రోజులపాటు 25 గ్రామాల మీదుగా 80 కిలోమీటర్లు సాగనుంది. యాత్రలో ఎంఎల్‌ఎ నిమ్మలతోపాటు మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు. ఎంఎల్‌ఎ పలుచోట్ల రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అక్కడక్కడా చేలల్లోకి దిగి రైతులతో కలిసి వ్యవసాయ పనులు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ అన్నదాత కష్టపడి పండించుకున్న ధాన్యం కొనుగోలు పేరుతో జగన్ ప్రభుత్వం దోపిడీ చేసిన రూ.ఐదు వేల కోట్లు రైతులకు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగేలా వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో తన గళం విన్పిస్తానని తెలిపారు. అధికారంలోకి రాబోయే టిడిపి, జనసేన ప్రభుత్వంలో రైతాంగానికి అన్నివిధాలుగా న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ మాట్లాడుతూ జగన్ అన్ని రకాలుగా రైతాంగాన్ని దగా మోసం చేశాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రైతు జిల్లా అధ్యక్షులు పాతూరి రామప్రసాద్ చౌదరి, సెక్రటరీ తమ్మిరెడ్డి నాగేశ్వరరావు, కోడి విజయభాస్కర్, పాముల రజినీకుమార్, మామిడిశెట్టి పెద్దిరాజు, గండేటి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి బాబు, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, ఇంటి శ్రీరాముడు, అందకోటి వీరభద్రం, అంగర వీరభద్రకుమార్, కామిశెట్టి అయ్యప్పనాయుడు, పెనుమత్స సాయిరాజు, సహదేవుడు, రాయి ప్రసాద్, కౌరు మురళి, పెనుమత్స శ్రీనివాసరాజు, వల్లూరి ధనుంజయ, దొడ్డ శ్రీనివాసరావు, నెక్కింటి ఆదినారాయణ, జనసేన నాయకులు సిద్దిరెడ్డి అప్పారావు, కొడవటి వరబాబు, శిడగం సురేంద్ర, నియోజకవర్గ ఇన్‌ఛార్జి తాళం రామలింగేశ్వరరావు, బండారు రాజేష్, ఎంపిటిసి నడపన నరసింహస్వామి, బోనం నాని, చిట్టూరి ఆంజనేయులు, కడలి గోపీ, పి.బలరామరాజు, గొల్ల నాగయ్య, గంట్రోతి పెద్దరాజు, పల్లె సత్యనారాయణ, చొప్పల వెంకటరావు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీడిత శ్రామికవర్గ విముక్తికి మార్క్సిజమే మార్గం

లెనిన్ శత వర్ధంతి సభలో వక్తలు

మోడీ మతోన్మాద పాలనపై పోరాడాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

లెనిన్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ప్రపంచ శ్రామికవర్గ పీడిత విముక్తికి మార్క్సిజమే ఏకైక మార్గమని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ కార్మికవర్గ శ్రమను దోచుకుంటున్నాయని, ఈ నేపథ్యంలో కార్మికవర్గం అంతా ఏకతాటిపైకి వచ్చి మతోన్మాద పాలనపై ఐక్య ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. పోరాడితే పోయేదేముంది.. బానిస సంకెళ్లు తప్ప అనే నినాదాన్ని అందిపుచ్చుకుని లెనిన్ శత వర్ధంతి స్ఫూర్తితో అంతా ముందుకు సాగాలని ప్రతినబూనారు. స్థానిక ప్యాడీ అండ్ రైస్ మర్చంట్స్ భవనంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోవియట్ విప్లవ రథసారథి వి.ఐ.లెనిన్ శత వర్ధంతి సభ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత లెనిన్ చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, రచయితలు, కళాకారులు, కార్మిక నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అధ్యక్షతన నిర్వహించిన సభలో లెనిన్ జీవిత విషయాలపై ముద్రించిన పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు లెనిన్ కార్మికవర్గ సమస్యల పరిష్కారానికి చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు, డి.కళ్యాణి, పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, కేతా గోపాలన్, జిల్లా కమిటీ సభ్యులు కె.రాజారామ్మోహన్‌రాయ్, ఎ.అజయకుమారి, జుత్తిగ నరసింహమూర్తి, జక్కంశెట్టి సత్యనారాయణ, గొర్ల రామకృష్ణ పాల్గొన్నారు.

మోడీ మతోన్మాద పాలనపై పోరాడాలి

మంతెన సీతారాం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

కార్మిక, శ్రామికవర్గ విముక్తికి మార్క్సిజమే సరైన మార్గం. లెనిన్ స్ఫూర్తితో సమస్యల పరిష్కారానికి ఐక్యతతో ముందుకు సాగాలి. జార్ చక్రవర్తిని ఎదుర్కొని ప్రపంచంలో మొట్టమొదటిసారి సోవియట్ యూనియన్‌ని సాధించిన ఘనత లెనిన్‌దే. ప్రపంచ చరిత్ర గతిని మార్చిన మహనీయుడు లెనిన్. ఒక జాతి మరొక జాతిని, ఒక మనిషి మరొక మనిషిని దోచుకునే పద్ధతిని నిర్మూలించిన మహోన్నత వ్యక్తి లెనిన్. ప్రజల బాధలకు పెట్టుబడిదారీ విధానమే కారణం. సోషలిజమే సమస్యలకు పరిష్కార మార్గం. దేశంలో నిరుద్యోగం, పేదరికం, అసమానతలకు ప్రస్తుత పెట్టుబడిదారీ పాలకులు పరిష్కారం చూపలేరు. ఎర్రజెండా రాజ్యంలోనే ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారు. కేంద్రంలో మోడీ అవలంబిస్తున్న మొత్తం విధానాలపై ఐక్యంగా పోరాడాలి.

విప్లవాలకు దిక్సూచి లెనిన్

కె.కుమార్, సాహితీవేత్త, రచయిత



ప్రపంచంలో సాధించిన విప్లవాలకు లెనిన్ ఒక దిక్సూచి. జార్ చక్రవర్తి నియంతృత్వంలో నలిగిపోయిన రష్యా విముక్తికి లెనిన్ పోరు సాగించి సోవియట్ యూనియన్ విప్లవం సాధించింది. లెనిన్ జీవితం నేటి విప్లవాలకూ స్ఫూర్తి. రష్యాలో జార్ చక్రవర్తికి వ్యతిరేకంగా సాహిత్యాలు ఒకవైపు, పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమాలు మరోవైపు ముమ్మరంగా సాగాయి. సోవియట్ విప్లవం అనంతరం ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గ భావజాలాన్ని వ్యాప్తి చేస్తే మన దేశంలో ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని ప్రజల్లో వ్యాప్తి చేసేలా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. రామాయణం పేరుతో ప్రజల విశ్వాసాన్ని కూడా మోడీ ప్రభుత్వం రాజకీయం చేస్తోంది. ప్రజల్లో లౌకికవాదాన్ని పెంపొందించేలా విప్లవ సాహిత్యాన్ని ప్రచారం చేయాలి.

కార్మికవర్గ విప్లవానికి నిర్మాణం కీలకం

బి.బలరాం, సిపిఎం జిల్లా కార్యదర్శి

కార్మిక వర్గ విప్లవానికి నిర్మాణం కీలకం. దీనిని లెనిన్ నిర్మించారు. కార్మికవర్గ ఐక్యతను చాటి చెప్పేలా కార్మిక, కర్షకుల ఐక్యతను లెనిన్ ఆదర్శంగా సాధించారు. ప్రతి కార్యకర్తా క్రమశిక్షణగా నిలవాలనేది లెనిన్ నుంచే నేర్చుకోవాలి. కర్తవ్య నిర్వహణలో లెనిన్ జీవితం స్ఫూర్తిదాయకం. కమ్యూనిస్టుకు నిలువెత్తు రూపం లెనిన్. నియంతృత్వ పాలన సాగించే జార్ చక్రవర్తిని తుద ముట్టించిన ఘనత లెనిన్‌ది. పోరాటాలు నడిపే క్రమంలో కుటుంబ సభ్యులను కోల్పోయినా, వచ్చే కష్టాలను కూడా అధిగమించి విప్లవాన్ని ముందుకు నడిపించారు. లెనిన్ విప్లవ స్ఫూర్తితో దేశంలో ప్రజాతంత్ర విప్లవాన్ని సాధించేలా ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించడానికి సిద్ధంగా ఉండాలి.

విప్లవానికి నాయకత్వం వహించేది కార్మికవర్గమే

చింతకాయల బాబూరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు



మార్క్స్, లెనిన్ స్ఫూర్తితో కార్మికవర్గానికి, ప్రజా బాహుళ్యానికి విప్లవ భావజాలాన్ని అందించాలి. బిజెపి ప్రభుత్వం ప్రజల మధ్య కుల, మత ఘర్షణలను సృష్టిస్తోంది. మోడీ దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెడుతున్నాడు. దేశ సంపాదన కాపాడుకోవాలంటే కార్మికవర్గాన్ని ఐక్యం చేసి ఐక్య ఉద్యమాలు చేపట్టాలి. ప్రతి విప్లవానికీ నాయకత్వం వహించేది దేశంలో ఉన్న కార్మికవర్గమే. ప్రజలందరూ సోషలిస్టు, కమ్యూనిజ భావజాలాన్ని పెంపొందించుకోవాలి.

గొప్ప మానవతావాది లెనిన్

జెఎన్‌వి.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

ప్రపంచంలో విప్లవాలకు నాయకత్వం వహించిన వారిలో రెండో అగ్రశ్రేణి నాయకుడు లెనిన్. ప్రపంచంలోనే నిస్వార్థపూరిత గొప్ప మానవతావాది ఆయన. నేటి యువతకు లెనిన్ జీవితం ఒక అదర్శం కావాలి. విప్లవంలో ప్రజలను చైతన్యపర్చడమే కాకుండా వారి సమస్యల పరిష్కారం కోసం మహోత్తర పోరాటాన్ని లెనిన్ సాగించారు. విప్లవం సాధించిన దేశాల్లో ప్రభుత్వాల పాలన ప్రజల సంక్షేమం కోసం ఉంటాయని కోవిడ్ కాలంలో రుజువైంది. కోవిడ్‌లో పెట్టుబడిదారీ దేశాల్లో లక్షలాది మంది ప్రజలు మరణిస్తే సోషలిస్టు దేశాల్లో ప్రజల ప్రాణాలను రక్షించారు. రష్యాలో విప్లవం సాధించాక కూడా నిరాడంబర జీవితాన్ని గడిపిన గొప్ప విప్లవ యోధుడు లెనిన్.

భూయాజమాన్య హక్కుల చట్టాన్ని వ్యతిరేకిస్తూ
నరసాపురం బంద్ విజయవంతం



ప్రజాశక్తి - నరసాపురం

ప్రజాశక్తి - నరసాపురం

ఎపి భూయాజమాన్య హక్కుల చట్టంను రద్దు చేయాలని కోరుతూ నరసాపురం న్యాయవాదుల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన నరసాపురం బంద్ విజయవంతమైంది. న్యాయవాదులకు మద్దతుగా పట్టణంలోని దుకాణాలు, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు. టిడిపి, జనసేన, సిపిఎం, సిపిఐ, బిజెపి బంద్‌కు మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా న్యాయవాదులు పట్టణంలో నిర్వహించిన ప్రదర్శనలో ఆయా పార్టీల నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, సీనియర్ నాయకులు కొవ్వలి యతిరాజారామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త భూయాజమాన్య చట్టంతో భూ యజమానులకు రక్షణ లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కొత్త భూహక్కు చట్టం పేరుతో ప్రజలను మరోమారు మోసగిస్తుందని విమర్శించారు. కొత్త భూహక్కు చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ముచ్చర్ల త్రిమూర్తులు, పొన్నాడ రాము, టిడిపి నాయకులు కొప్పాడ రవి, శంకు భాస్కర్‌నాయుడు, కొల్లు పెద్దిరాజు, జక్కం శ్రీమన్నారాయణ, పొన్నాల నాగబాబు, నక్క ఆనంద్‌బాబు, శశిదేవి, బుర్ర చిన్నాయమ్మ, భోగిరెడ్డి ముత్యం, సిపిఐ నాయకులు నెక్కంటి క్రాంతికుమార్, నెక్కంటి సుబ్బారావు, బార్ అసోసియేషన్ నాయకులు చల్లా దానయ్యనాయుడు, ఆర్‌జి.కుమార్, నారిన శ్రీనివాసరావు, దొంగ నరసింహారాజు, బల్ల శ్రీహరి, కొప్పునేడి చిట్టి పద్మజ, అడబాల సుజాత, యర్రంశెట్టి ఫణికర్, రామన్న తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ ఎస్ఐగా హరికృష్ణ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పాలకొల్లు రూరల్ ఎస్ఐగా డి.హరికృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో బదిలీల్లో భాగంగా ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో పెంటపాడు పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

మాంటిస్సోరిస్‌లో మెగా సైన్స్‌ఫేర్

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్లో ఏర్పాటు చేసిన మెగా సైన్స్‌ఫేర్‌ను వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపాలరావు (గోపి) సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను సందర్శించి వారి కృషిని అభినందించారు. విద్యార్థులు సృష్టించిన ప్రాజెక్టులు చాలా ఆశ్చర్యానికి గురిచేశాయన్నారు. వాటిని సృష్టించడానికి విద్యార్థులు రాత్రి పగలూ చాలా కష్టపడ్డారని తెలిపారు. ఇంత గొప్పగా సైన్స్‌ఫేర్ నిర్వహిస్తున్న ఉల్లంపర్రు మాంటిస్సోరి స్కూల్ యాజమాన్యాన్ని ఆయన ప్రసంశించారు. ఈ కార్యక్రమంలో మద్దాల రాంప్రసాద్, మద్దాల వాసు, ప్రిన్సిపల్ వసంతలక్ష్మి, రావడ సతీష్, కౌరు రాంపాడను ప్రత్యేకంగా అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకు చెందిన నాగమళ్ల నాగేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం కాళ్ల గ్రామ యువత, గ్రామస్తులు ముందుకొచ్చి మృతుని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం రూ.44 వేల ఆర్థిక సాయాన్ని నాగేశ్వరరావు భార్యకు అందజేశారు.

బూత్ కమిటీ సభ్యులు కష్టపడాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

వైసిపి బూత్ కమిటీల సభ్యులు ఈ రెండు నెలలు పార్టీ కోసం మరింత కష్టపడాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల బూత్ కన్వీనర్లతో విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం జగన్ ఐదేళ్లుగా నిత్యం కష్టపడుతూ అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు.

'దళితులకు అండగా జనసేన'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దళితులకు అన్ని రకాలుగా జనసేన అండగా ఉంటుందని పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనువాస్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు సజ్జ సుబ్బు, కొనగల హరినాథ్ ఆధ్వర్యంలో పెంటపాడు కూనగారి పేటకు చెందిన యువత సుమారు 50 మంది జనసేనలో చేరారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనువాస్ మాట్లాడుతూ దళితులకు మాయమాటలు చెప్పి అందలం ఎక్కిన తర్వాత అన్ని రకాలుగా మోసం చేసిన ప్రభుత్వం వైసిపి అన్నారు. దళితులపై దాడులు జరుగుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. కార్యక్రమంలో పెంటపాడు మండల అధ్యక్షుడు పుల్లా బాబి, మహిళ నాయకురాలు కె.మధులత, పి.సోమలమ్మా, చాపల రమేష్, మలబాకు చిట్టి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు వినియోగించుకొని ఉచిత వైద్యం పొందాలని గణపవరం సర్పంచి మోర అలంకారం అన్నారు. స్థానిక నాలుగో సచివాలయం వద్ద శుక్రవారం ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఎంతో ఖరీదైన వైద్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవాలని జగనన్న ప్రభుత్వం గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా వైద్యం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పివి.సత్యనారాయణ, సూర్య బలిజ రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్, పిహెచ్‌సి డాక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు.

ఆడపిల్లల రక్షణ బాధ్యత అందరిది

ప్రజాశక్తి - గణపవరం

సమాజంలో ఆడపిల్లల రక్షణ అందరి బాధ్యతని కొమ్మర గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి కె.లక్ష్మి అన్నారు. శుక్రవారం గ్రామంలో జరిగిన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో స్థానికులకు ఆడపిల్లల రక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ ఆడపిల్లలను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే విధంగా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ఎ.బుజ్జి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉండి : ఆడపిల్లలను చదివించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నిర్మల అన్నారు. శుక్రవారం చిలుకూరులో నిర్వహించిన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో పాల్గొన్న నిర్మల మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ జి.వెంకటలక్ష్మి, సూరమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

పెనుగొండ : బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం పెనుగొండ పరిధిలో చెరుకువాడ అంగనవాడీ కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారి ఎం.విజయకుమారి మాట్లాడారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

గణపవరం ఎంపిడిఒ బదిలీ

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం ఎంపిడిడిఒ జి.జ్యోతిర్మయి శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా రాజనగరం బదిలీ అయ్యారు. మండల ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా ఇఒపిఆర్‌డి పివి.సత్యనారాయణ నియమితులయాయరు.

4న దేవాంగ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - పాలకొల్లు

జిల్లా దేవాంగ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం ఈ నెల 4వ తేదీ ఆదివారం పాలకొల్లు క్లాత్ మర్చంట్స్ సంఘ భవనంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు వట్ట గణేష్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ సంఘం అధ్యక్షులు డికె నాగరాజు, ప్రధాన కార్యదర్శి పుచ్చల రామకృష్ణ, కోశాధికారి ఉప్పు కనకరాజు, జిల్లా మాజీ అధ్యక్షులు ఎర్ర సోమలింగేశ్వరరావు పాల్గొనున్నారు. సమావేశంలో రాష్ట్ర దేవాంగ సంఘం ఎదుర్కొంటున్న పలు సమస్యల గురించి చర్చిస్తారని ఆయన తెలిపారు. అలాగే మహిళా విభాగం అధ్యక్షురాలు ఉప్పుగంటి రాజశ్రీ, ప్రధాన కార్యదర్శి మానేయం జయలక్ష్మి, కోశాధికారి కాకర్ల సుభద్ర, ఉపాధ్యక్షులు బాసిన భార్గవి ప్రమాణస్వీకారం చేస్తారని తెలిపారు.

నేడు సర్విశెట్టి వర్ధంతి

ప్రజాశక్తి - నరసాపురం

స్థానిక బిజిబిఎస్ ఉమెన్స్ కళాశాలలో శనివారం పద్మశ్రీ అద్దేపల్లి సర్విశెట్టి 33వ వర్ధంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ తెలిపారు. కళాశాలలో నూతనంగా నిర్మించిన అద్దేపల్లి సర్విశెట్టి బ్లాక్ క్లాస్ రూమ్స్, ఆర్ఒ ప్లాంట్ ప్రారంభోత్సవం జరుగుతాయని తెలిపారు. ముఖ్యఅతిథిగా సర్విచెట్టి మనవడు ఎ.మధుకుమార్, కుటుంబ సభ్యులు హాజరవుతారని తెలిపారు.

ఇద్దరు పాత నేరస్తులు అరెస్ట్

రూ.4 లక్షలు స్వాధీనం

పాలకొల్లు : పాలకొల్లులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు పాత నేరస్తులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.4 లక్షల విలువైన 98 గ్రాముల బంగారు వస్తువులు, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సిఐ కె.మంగాదేవి చెప్పారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ డిసెంబరులో పూలపల్లిలో జరిగిన దొంగతనంలో వీరికి సంబంధం ఉందని తెలిపారు. రాజమండ్రికి చెందిన ఈ ఇద్దరు యువకులు పాత నేరస్తులన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ బాదం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పోడూరు

కవిటం సెంటర్ లో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోడూరు గ్రామానికి చెందిన పోడూరి వీరాస్వామి(70) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. పోడూరుకు చెందిన వీరాస్వామి మార్టేరు నుండి కవిటం వైపు వస్తుండగా ఎదురుగా పల్సర్ బైక్‌పై వస్తున్న ముగ్గురు యువకులు వేగంగా వీరాస్వామి బండిని ఢీకొట్టడంతో వీరాస్వామి అక్కడిక్కడే మృతి చెందాడు. ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయనీ, మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రాష్ట్రాభివృద్ధి టిడిపి, జనసేనతోనే సాధ్యం

ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి - జనసేన ప్రజా ప్రభుత్వం అధికారంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. దొడ్డనపూడిలో 'ఇంటింటికీ టిడిపి' బాబుతో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టిడిపి, జనసేన శ్రేణులతో కలిసి శుక్రవారం నిర్వహించారు. దొడ్డనపూడి కచ్చా గరువు నుంచి నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి టిడిపి జనసేన శ్రేణులు అడుగడుగునా నీరాజనాలు పలికారు. ఎంఎల్ఎ రామరాజుకు అడుగడుగునా మహిళలు హారతులిచ్చారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితే అన్ని తరగతుల ప్రజలకూ న్యాయం జరుగుతుందన్నారు. ఈ ప్రభుత్వంలో పెంచిన పన్నులు కట్టలేక పేద, మధ్యతరగతి ప్రజలు అల్లాడుతున్నారన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యం, మౌలిక వసతులు విస్మరించి రాష్ట్ర అభివృద్ధిని అధోగతి పాలు జేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఆరేటి వెంకట రత్నప్రసాద్, టిడిపి మండల అధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు, బండారు వేణుగోపాలరావు, ఉపసర్పంచి కొప్పర్తి ఏసురాజు, గ్రామాధ్యక్షుడు కొల్లి భోగేశ్వరరావు పాల్గొన్నారు.

రామరాజుకు హారతులిస్తున్న మహిళలు

కోకోలో మోగల్లు జట్టు విజయం

ప్రజాశక్తి - పాలకోడేరు

'ఆడుదాం ఆంధ్ర' జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో మోగల్లు జట్టు క్రీడాకారులు విజయం సాధించారు. భీమవరం డిఎన్ఆర్ కళాశాలలో జరుగుతున్న పోటీల్లో మోగల్లు జట్టు జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చి విజయం అందుకుంది. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో జరిగిన పోటీల్లో మోగల్లు జట్టు క్రీడాకారులు అన్ని విభాగాల్లో రాణించి జిల్లా స్థాయికి చేరుకుని విజయం చేజిక్కించుకున్నారు. డిసిసిబి ఛైర్మన్ వి వి ఎల్. న ర సిం హ రా జు, పాలకోడేరు ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటిరాజు), పంచాయతీ ఉప సర్పంచి, వైసిపి ముఖ్యనేత పెనుమత్స సీతారామరాజు (సీతయ్య) క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా సీతయ్య మాట్లాడుతూ జిల్లాస్థాయి పోటీల్లో తమ గ్రామ క్రీడాకారులు సత్తా చాటి విజయం సాధించడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు.

కోకో పోటీలో విజయం సాధించిన మోగల్లు క్రీడాకారులు

అక్కా చెల్లెమ్మలకు వైఎస్ఆర్ ఆసరా చెక్కు అందజేత

ప్రజాశక్తి - నరసాపురం

వైఎస్ఆర్‌కు సంబంధించి వరుసగా నాలుగు విడతల నగదును పొదుపు సంఘాల అక్క చెల్లెమ్మల ఖాతాలో జమ చేసి వారికిచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నామని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం పురపాలక సంఘం పరిధిలో 11 నుంచి 27వ వార్డులకు సంబంధించిన స్వయం సహాయక సంఘాల గ్రూపులకు నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం పట్టణంలోని మిషన్ హైస్కూల్ రోడ్డు హైవే గార్డెన్స్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముదునూరి ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఆసరా పథకం కింద నరసాపురం నియోజకవర్గంలో 3,787, స్వయం సహాయక సంఘాల గ్రూపులు 37,845 మంది సభ్యులకు మొదట విడతగా రూ.38.55 కోట్లు, రెండో విడతగా రూ.38.62 కోట్లు మూడో విడతగా రూ.38.52 కోట్లు, నాలుగో విడతగా రూ:38.52 కోట్లు మొత్తం నాలుగు విడతలుగా రూ.154. 28 కోట్లు నేరుగా అక్క చెల్లెమ్మల ఖాతాల్లోకి సిఎం వేసినట్లు తెలిపారు. పట్టణంలో 11 నుండి 27 వార్డులకు, 326 స్వయం సహాయక సంఘాల గ్రూపులకు, 3260, మంది అక్క చెల్లెమ్మలకు రూ.2 కోట్ల 93 లక్షల 75 వేల విలువైన చెక్కును అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, వైస్ ఛైర్ పర్సన్ కామన నాగిని, షేక్ బుల్ మస్తాన్, ఏడిది కోట సత్యనారాయణ, కాగిత సత్యవాణి పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరు, కాళీపట్నం గ్రామాల్లోని ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ.పది కోట్ల నిధులు మంజూరు చేశామని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మొగల్తూరులో ఆసరా లబ్ధిదారులకు నమూనా చెక్కును ముదునూరి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొగల్తూరులోని పాతకాలవ ప్రాంతంలో జాతీయ రహదారి నుండి గాంధీ బొమ్మ కూడలి, రైస్ మిల్ ప్రాంతం మీదుగా పెద్ద పల్లవపాలెం వరకూ, కాళీపట్నం తూర్పులో జాతీయ రహదారి నుండి వంతెన ప్రాంతం మీదుగా జాతీయ రహదారి వరకూ అభివృద్ధి చేయనున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి తిరుమాని బాపూజీ, సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, బోణం నరసింహారావు పాల్గొన్నారు.

25న మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గంలోని కాపు, తెలగ, బలిజ విద్యార్థులకు ఈ నెల 25న లయన్స్ కమ్యూనిటీ హాల్లో స్కాలర్‌షిప్స్ అందజేయనున్నట్లు కాపు సంఘం అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటరత్నం తెలిపారు. కృష్ణ దేవదాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ ప్రివిలేజ్డ్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తులసీ రామచంద్ర ప్రభు, గుంటూరు వారి ఆధ్వర్యంలో పాలకొల్లు శ్రీకృష్ణ దేవరాయ కాపు సంఘం, వన సమారాధన కమిటీ, కోపావారి సహకారంతో స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఇంటర్, పాలిటెక్నిక్ సెకండియర్, డిగ్రీ, బిటెక్, పీజీ మెడిసిన్ ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల్లో చదివిన విద్యార్థులు స్కాలర్‌షిప్‌నకు అర్హులని తెలిపారు. గత వార్షిక పరీక్షల్లో 75 శాతం పైగా మార్కులు పొందినవారు ఉపకార వేతనానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దీనికి సంబంధించి దరఖాస్తులను చవాకుల సురేష్‌బాబు, కొమ్ముల మురళీకృష్ణ, వంగా నర్సింహారావు, యర్రంశెట్టి వెంకట రత్నం వద్ద లభిస్తాయని తెలిపారు. దరఖాస్తుల కోసం 9494337711, 9396955555, 9912243612 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. విద్యార్థి తల్లి లేక తండ్రి ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండకూడదని తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి పేద కుటుంబానికి చెందినవారై ఉండాలని, ప్రతి పరీక్షలో 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలని, విద్యార్థి తల్లిదండ్రులు పాలకొల్లు నియోజకవర్గానికి చెందినవారై, కాపు సామాజిక వర్గానికి చెందినవారై ఉండాలని తెలిపారు. ఈనెల 12వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

శ్రీనివాస్ నెహ్రూను కఠినంగా శిక్షించాలి

ఐద్వా ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అత్తిలి మండలం బల్లిపాడు నంబరు-2 ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాస్ నెహ్రూను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా నాయకురాలు బి.యశోద తెలిపారు. శుక్రవారం తాడేపల్లిగూడెం మండల ఐద్వా కమిటీ ఆధ్వర్యంలో ఇటుకులగుంటలో స్థానిక ఎలిమెంటరీ స్కూలు వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ఐద్వా జిల్లా నాయకురాలు బి.యశోద, మండల నాయకురాలు పాలపర్తి సత్యవతి హాజరై మాట్లాడారు. కీచక ఉపాధ్యాయుడికి తక్షణం శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ వృత్తికే తలవంపు తెచ్చే విధంగా ప్రవర్తించిన కీచక ఉపాధ్యాయుడు శ్రీనివాస నెహ్రూకు కోర్టులో జాప్యం లేకుండా వెంటనే శిక్ష విధించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన అత్తిలి మండలం బల్లిపాడు ప్రాథమిక పాఠశాల సంఘటన కలిచివేసిందన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండి సభ్యసమాజానికి కళంకం తెచ్చే విధంగా శ్రీనివాస నెహ్రూ ప్రవర్తించారన్నారు. శ్రీనివాస నెహ్రూను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో మహిళా పోలీసులు ప్రతి రోజూ పాఠశాలకు వెళ్లి పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘాలు పాల్గొన్నారు.

పశ్చిమ ప్రజలకు సేవచేసే అవకాశం లభించింది

జిల్లా ఎస్‌పిగా అజిత వేజెండ్ల బాధ్యతల స్వీకరణ

భీమవరం: పశ్చిమ ప్రజలకు సేవ చేసే భాగ్యం లభించడం ఎంతో ఆనందంగా ఉందని జిల్లా నూతన ఎస్‌పి అజిత వేజెండ్ల అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఎస్‌పిగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగబద్ధంగా శాంతి భద్రతలను నెలకొల్పడంలో బాధ్యతతో ఉంటానన్నారు. మహిళలు, బాలికలపై జరిగే అఘాయిత్యాలకు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలోని పరిస్థితులను అర్థం చేసుకొని పోలీసు వ్యవస్థ పటిష్టంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి అజిత

కలెక్టర్‌ను కలిసిన కొత్త ఎస్‌పి

ప్రజాశక్తి - భీమవరం

స్థానిక కలెక్ట రేట్లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని జిల్లా ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన అజిత వేజెండ్ల శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రానున్న సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ ప్రశాంతి ఎస్‌పి అజితతో కొద్దిసేపు చర్చించారు. జిల్లాను శాంతిభద్రతల విషయంలో ముందుంచాలని కలెక్టర్ ఎస్‌పికి సూచించారు.

డిఎస్‌సి పోస్టుల సంఖ్య పెంచాలి

డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శర్మ, ధనుష్

భీమవరం: ప్రభుత్వం విడుదల చేసిన డిఎస్‌సి పోస్టుల సంఖ్య పెంచాలని 25 వేల ఉద్యోగాలతో మెగా డిఎస్‌సి ప్రకటించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్ఎన్‌వి.శర్మ, గేదెల ధనుష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 25 వేల పోస్టులతో మెగా డిఎస్‌సి విడుదల చేస్తామని చెప్పి 6100 పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయడం సరైంది కాదని విమర్శించారు. డివైఎఫ్ఐ పోరాట ఫలితంగా డిఎస్‌సి ప్రతిపాదనను మంత్రి మండలి ఆమోదించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా డిఎస్‌సికి సుమారు 10 లక్షల మంది తమ సమయాన్ని, డబ్బును వెచ్చించి కృషి చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో సుమారు 45 వేల మంది డిఎస్‌సి కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఇది దగా డిఎస్‌సి కానీ మెగా డిఎస్‌సి కాదని తెలిపారు. ఈ నోటిఫికేషన్‌తో జగన్ ప్రభుత్వానికి నిరుద్యోగుల పట్ల విద్యారంగం అభివృద్ధి పట్ల అసలు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. మెగా డిఎస్‌సి ప్రకటించకపోతే రాబోయే రోజుల్లో డివైఎఫ్ఐ నిరుద్యోగులను సంఘటితం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఈవ్‌టీజర్ల అరాచకం..!

ఇద్దరు బాలికలు, బాలునికి గాయాలు

నరసాపురం: నరసాపురంలో శుక్రవారం ఈవ్‌టీజర్లు రెచ్చిపోయారు. పట్టణంలో ఓ ప్రయివేట్ కాలేజీలో చదువుతున్న ముగ్గురు అమ్మాయిలు రుస్తుంబాద వైపు నడిచివెళ్తున్నారు. నెంబర్‌లేని డ్యూక్ బైక్‌పై అతివేగంగా ఇద్దరు యువకులు ఈ బాలికలపైకి దూసుకొచ్చారు. ఆ సమయంలో ఆ బాలికల పక్కగా సైకిల్‌పై వెళ్తున్న బాలుడిని సైతం వారు ఢీకొనడంతో ఆ బాలుని చేతికి గాయాలయ్యాయి. రుస్తుంబాద బాలికలకు చేతికి, తలకు గాయమవ్వగా, పక్కనే ఉన్న హాస్టల్ విద్యార్థిని ఐడి కార్డు పగిలి నుదుటిపై దిగి తీవ్ర రక్తస్రావమైంది. వారిని స్థానికులు హుటాహుటీన ఆసుపత్రికి తరలించారు. అనంతరం తీవ్రంగా గాయపడిన బాలికలను భీమవరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఆ యువకులు బైక్‌తో సహా పరారు కావడంతో వారిని గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్ ఆవిష్కరణ

ఒపిఎస్ ఇచ్చిన వారికే మా ఓటు - యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం యుటిఎఫ్ చేపట్టిన ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్‌ను స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి హాజరై మాట్లాడారు. జగన్ ప్రతిపక్షంలో ఉండగా అధికారం చేపట్టిన వారం రోజుల్లో పాత పెన్షన్ పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని విమర్శించారు. పాత పెన్షన్ కోసం ఉద్యమించిన వారిని ఉక్కుపాదంతో అణిచివేశారన్నారు. ప్రస్తుత ఎన్నికల తరుణంలో 'ఒపిఎస్ ఇచ్చినవారికే మా ఓటు' అంటూ కార్యక్రమాలు రూపొందించామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు సిహెచ్.కుమార్‌బాబ్జీ, జి.రామకృష్ణారావు, కెసిహెచ్.సాయిరాం, డి.ఏసుబాబు, నాయకులు బి.నాగబాబు, పిల్లి శ్రీనివాస్, పి.గోపాలరావు, జ్ఞానమూర్తి, తిలక్, ఎం.వనజాక్షి పాల్గొన్నారు.

'టిడిపి, జనసేన కూటమికే మద్దతు'

ప్రజాశక్తి - మొగల్తూరు

ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమికే రాష్ట్రంలోని అగ్నికుల క్షత్రియులు మద్దతుగా నిలుస్తారని టిడిపి అగ్నికుల క్షత్రియుల రాష్ట్ర కన్వీనర్ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. శుక్రవారం ముత్యాలపల్లిలో అగ్నికుల క్షత్రియ సాధికారిక కమిటీ ఆధ్వర్యంలో టిడిపి, జనసేన కూటమికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి, జనసేనకు అండగా ఉండాలన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక పాలనను అంతమొందించడం కోసమే టిడిపి, జనసేన కూటమి ఏర్పడిందన్నారు. వైసిపి ప్రభుత్వంలో రాష్టంలో సుమారు అరవై లక్షలున్న అగ్నికుల క్షత్రియులకు ప్రాధాన్యత లేదన్నారు. అగ్నికుల క్షత్రియులపై దాడులు చేయడమే కాకుండా, అధికార పార్టీ నేతలు అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. అగ్నికుల క్షత్రియులకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అనంతరం ఎన్‌టిఆర్, అగ్నికుల క్షత్రియుల జాతిపిత, అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణకర్త కోపనాతి కృష్ణమ్మ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో నాయకులు నాగిడి రాంబాబు, బంధన నరసింహస్వామి, కొల్లాటి బాలకృష్ణ, మూలస్వామి ఉన్నారు.

టిడిపి, జనసేన మాటలు నమ్మొద్దు : మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం: సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నే మనందరికీ రక్ష అని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు ఏనాడైనా పేదవాడికి ఒక్క సెంటు స్థలం ఇచ్చాడా అని ప్రశ్నించారు. టిడిపి, జనసేనను నమ్ముకుంటే నట్టేట మునిగినట్లేనని హెచ్చరించారు. తాడేపల్లిగూడెంలో శుక్రవారం జరిగిన టిడ్కో గృహాల పంపిణీ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 1120 మంది లబ్ధిదారులకు టిడ్కో గృహాల హక్కు పత్రాలను, తాళాలను అప్పగించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో కేవలం ఏడు నెలల కాలంలోనే నియోజకవర్గంలో 4,256 మందికి టిడ్కో గృహాలను అందజేసినట్లు తెలిపారు. కాంట్రాక్టు ఏజెన్సీతో కుమ్మక్కై చంద్రబాబు వందల కోట్లు కాజేశాడని విమర్శించారు. తాడేపల్లిగూడెం, భీమవరం, పాలకొల్లు, తణుకు పట్టణాల్లో టిడ్కో గృహాల పనులు పూర్తి చేయడానికి తాను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా 100 కోట్ల రూపాయలు విడుదల చేశారన్నారు. దాంతో పనులు పూర్తిచేసి గత ఏడాది జూన్ 30న మొదటి విడతగా 2272 మందికి, అక్టోబర్ 19న మరో 960 మందికి, నేడు 1024 మందికి ఇలా కేవలం 7 నెలల వ్యవధిలో మూడు విడతలుగా మొత్తం 4256 మంది లబ్ధిదారులకు టిడ్కో గహాలను అందజేయడం జరిగిందన్నారు. మహిళల చేతిలో పెట్టే ప్రతి రూపాయి సద్వినియోగమై ఆ కుటుంబానికి ఉపయోగపడుతుందని ఉద్దేశంతో ముఖ్యమంత్రి మహిళల ఖాతాలోనే నేరుగా సంక్షేమ పథకాల లబ్ధిని జమ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్, పట్టణ ప్రెసిడెంట్ జి.నాగు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కర్రి భాస్కరరావు, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ కొలుకులూరి ధర్మరాజు పాల్గొన్నారు.

ఉండి తహాశీల్దార్ గుడ్లవల్లేరుకు బదిలీ

ప్రజాశక్తి - ఉండి

ఉండి తహాశీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఏడిద శ్రీనివాస్ కృష్ణాజిల్లా గుడ్లవల్లేరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఉండి డిప్యూటీ తహాశీల్దార్ ఎస్.వీరాస్వామి నాయుడు ఆధ్వర్యంలో వీడ్కోలు సభను శుక్రవారం సాయంత్రం తహాశీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తీక్, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సాంబశివరావుకు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి - ఆకివీడు

ఇటీవల అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ పొందిన స్థానిక ఆదిత్య విద్యాసంస్థల అధినేత, ధ్యానరత్న ఉండ్రమట్ల సాంబశివరావును జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా విద్యాశాఖ అధికారి రమణ వేర్వేరుగా అభినందించారు. కాలిఫోర్నియా విశ్వవిద్యాలయానికి చెందిన ధ్యాన, యోగకు చెందిన ది యునైటెడ్ థియోలాజికల్ విభాగం ద్వారా సాంబశివరావు ఈ గౌరవ పురస్కారాన్ని అందుకున్నారు.

క్షీరా రామేశ్వర స్వామి సన్నిధిలో రైల్వే చీఫ్ ఇంజినీర్

పాలకొల్లు : రైల్వే చీఫ్ ఇంజినీర్ (బ్రిడ్జి) ప్రదీప్ గుప్త పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఆయనకు ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్ ఇఒ యాళ్ల సూర్యనారాయణ ట్రస్టీలు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఫొటో, ప్రసాదాలు ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు పాల్గొన్నారు.

కాశిపాడులో ఫ్రైడే డ్రైడే

గణపవరం: పిప్పర పిహెచ్‌సి ఆధ్వర్యంలో కాశిపాడు గ్రామంలో ఫ్రైడే డ్రైడే శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నామాల రాజు మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పనికిరాని వస్తువులను ఇంటికి దూరంగా ఉంచాలన్నారు. దోమలు దరిచేరకుండా ఇంటి కిటికీలకు, గుమ్మాలకు దోమతెరలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. దోమల వల్ల చికెన్ గున్యా, డెంగీ, మలేరియా జ్వరాలు వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఎఎన్ఎం శివకుమారి, ఆశాలు వరలక్ష్మి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

In the Court of the I Additional Junior Civil Judge, Tanuku

E.P. 69/2023, OS. 89/2021

Between:
DHR: Karri Prabhakara Reddy
JDR: Pethani Anantha Nagaraju

DHR తరపున చేసిన ప్రకటన

JDR: Pethani Anantha Nagaraju, S/o. Ranga Rao, Hindu, Male, 41 years, Employee, D.No. 5-172, Gubbala Kesavarao Street, Opp: Y Not Shopping Mall, Palangi Village, Undrajavaram Mandal.

పై నెంబరు E.P. గ్రంథములో JDR అయిన మీకు పై కోర్టు వారి ఆదేశం ప్రకారం ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను మీకు అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా మీరు **ది. 07-2-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియపరచుకొనవల సినదిగాను, అట్లు కాని యెడల పై కోర్టు వారు మీపై పరోక్షమున తీర్మానించుదురని ఈ ప్రకటన ద్వారా మీకు తెలియపరచుచున్నాము.

A.RAVIKUMAR
E.V.S.PRASAD
Advocates, Tanuku

ప్రకటన

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియరు సివిలు జడ్జి వారి కోర్టులో

O.S. No. 6/2023

Between:
సత్తి వెంకటరెడ్డి -వాది
మరియు
కురెళ్ళ రామలింగేశ్వరరావు -ప్రతివాది

To:
కురెళ్ళ రామలింగేశ్వరరావు, S/o. వెంకట్రాజు, వయస్సు 75 సం॥లు, హిందువు, మత్స్యపురి కోఆపరేటివ్ సొసైటీ బ్యాంకు మాజీ ప్రెసిడెంటు, R/o. D.No. 2-24/2, మత్స్యపురి - 534207, వీరవాసరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, భీమవరం PJCJC.

పై నెంబరు దావా గ్రంథములో మీకు ఎన్నిమార్లు కోర్టు నుండి దావా సమన్లు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకముగా తీసుకొనకపోవుట వలన ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా, పై నంబరు దావా గ్రంథము పై కోర్టులో **దివి. 28-02-2024వ తేదీకి వాయిదా కలదు. ఆరోజున ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు పై కోర్టులో స్వయముగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరై మీ సంజాయిషీ తెలియపరచవలెను. అట్లు మీరు హాజరు కాని యెడల మీకు పై దావా గ్రంథములో వాదన లేదని దావా మీ పరోక్షములో తీర్మానించబడును అని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)

K.M.M.SRINIVASA REDDY
అనపర్తి Advocate, Anaparthi
ది.02-02-2024 Cell: 9849135411

ప్రకటన

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియరు సివిలు జడ్జి వారి కోర్టులో

I.A. No. 187/2023, O.S. No. 6/2023

Between:
సత్తి వెంకటరెడ్డి -పిటీషనరు/వాది
మరియు
కురెళ్ళ రామలింగేశ్వరరావు -రెస్పాండెంటు/ప్రతివాది

To:
కురెళ్ళ రామలింగేశ్వరరావు, S/o. వెంకట్రాజు, వయస్సు 75 సం॥లు, హిందువు, మత్స్యపురి కోఆపరేటివ్ సొసైటీ బ్యాంకు మాజీ ప్రెసిడెంటు, R/o. D.No. 2-24/2, మత్స్యపురి - 534207, వీరవాసరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, భీమవరం PJCJC.

పై నెంబరు దావా గ్రంథములో పిటీషనరు/వాది పిటీషను పరిహారములు కోరుచూ పిటిషను షెడ్యూలు ఆస్తిని తోడజప్తు చేయమని మీపై పిటిషను దాఖలు చేసియున్నారు. సదరు పిటిషనులో కోర్టు నుండి మీకు ఎన్నిమార్లు నోటీసు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకముగా సదరు నోటీసును తీసుకునియుండలేదు. పై నంబరు పిటిషను పై కోర్టు వారి ఎదుట **దివి. 28-02-2024వ తేదీకి వాయిదా కలదు. ఆరోజున ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరై మీ సంజాయిషీ తెలియజేసుకోవలెను. అట్లు మీరు హాజరు కాని యెడల పై నంబరు పిటిషనులో మీకు వాదన లేదని పిటిషను మీ పరోక్షములో తీర్మానించబడును అని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)

K.M.M.SRINIVASA REDDY
అనపర్తి Advocate, Anaparthi
ది.02-02-2024 Cell: 9849135411